# మాతృప్రేమ

శ్రీమతి తాయి రోజాకృష్ణవేణిగారు

ఆమె నివాస మొకపర్వతాగ్రకుటీరము.

ఆనాడు గాలి హోరునవీస్తోంది.

వానతుంపర కొంచెము కొంచెముగా పడుతోంది.

కన్నులుపొడుచుకొన్నను కానరానికటికచీకట్లో ఉఱుములు భయంకర ధ్వనులతో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఆకొండలోయల్లోనుండి ఆపర్వతాగ్రశ్రేణిలోనుండి బయలుదేరిందామె బంధుగుల ఇంటికెళ్ళిన తల్లిని తోడ్కొని రావటానికి. ఆవేదనతోటి, భయముతోటి త్వరత్వరగా నడుస్తోంది.

ఇంతలో వర్షం ప్రబలమైంది.........

తల్లి వంటరిగా ఇంటికి చేరుకొన్నది.

ప్రియపుత్రికాముఖసందర్శనము కాకపోయేటప్పటికల్లా హతాశయై పోయిందామె.

ఆ ఉఱుముల ప్రతిధ్వనితో గుండెలు వ్రయ్యలవుతున్నా, చీకట్లో కళ్లు కానరాకున్నా ఆఝంఝామారుతంలో, ఆమెఱుపులక్రీనీడలో ఉద్వేగపూరితమైన హృదయంతో బయలుదేరిందామె కూతును గొంతెత్తిపిలుస్తూ.

ఆభయంకరకాళరాత్రియందు చెట్టనక, పుట్టనక గాలించింది.

కాని లాభంలేకపోయింది.........

చిట్టచివరకు గుర్తించిం దొకప్రవాహమొడ్డున కూతునడుగుజాడలను.

ఆనందంతో వాటివెనువెంటనే తడుముకొంటూ బయలుదేరింది.

అవి వంతెనమధ్యలో ఆగిపోయినాయి......

మరుక్షణంలో ఆనందమంతా దుఃఖంలోకి మారిపోయింది.

"ఇంకేటిబ్రతుకు తల్లీనాది? నీవూనేనూగలసి భగవానుని సామ్రాజ్యంలో అనిర్వచనీయానంద మనుభవిద్దాం" అంటూ ఒడ్డు తెగిపాఱుతూన్న ఆప్రవాహంలో గుభాలున ఉరికింది.

ఇంకేముంది?.........

ఆభయంకరకాళరాత్రి ప్రళయరాత్రైపోయింది.